క్లుప్తంగా

తక్కువ వడ్డీకే పంట రుణాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ అనిత

శింగనమల: సహకార బ్యాంక్ ద్వారా పంట రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్లు ఏడీసీసీ బ్యాంక్ గుత్తి రోడ్డు బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ అనిత తెలిపారు. బుధవారం శింగనమల సొసైటీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందదర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంక్‌లో రుణాలు పొందిన ప్రతి రైతు కేసీసీ కార్డు ఉపయోగించుకోవాలన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సీఈఓ సూర్యనారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భోగేశ్వరుని హుండీ లెక్కింపు

పామిడి: స్థానిక భోగేశ్వరాలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. సుమారు 10 నెలలకుగాను రూ.1,86,922 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయ ఈఓ కృష్ణయ్య, చైర్మన్ ఎస్ మురళీధర్‌గుప్తా తెలిపారు.

‘ఆడుదాం బెంగళూరు’ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన ఆడుదాం బెంగళూరు పోస్టర్లను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈనెల 23, 24న బెంగళూరులోని సార్జాపూర్ రోడ్డు కొడతి గ్రామ సమీపంలో ఉన్న బీకే క్రికెట్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీ వింగ్ రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జ్ సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ జిల్లా జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి, సభ్యుడు వంశీ, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గంగులకుంట కేశవరెడ్డి, వినోద్, వేణు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

పుట్లూరు: మండలంలోని ఏ.కొండాపురం గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. వివరాలు.. పెద్దపప్పూరు మండలం పెండేకల్లు గ్రామానికి చెందిన అర్జున్ బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెన్షనర్ల సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న సీనియర్ డీపీఓ చౌహాన్

గుంతకల్లు: పెన్షనర్ల సేవలు మరువలేనివని సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైల్వే కోర్టు సమీపంలోని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఆర్‌ఆర్‌ఎఫ్) కార్యాలయంలో ఆలిండియా పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో పెన్షన్‌దారులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలువురి పెన్షనర్లను సన్మానించారు. రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.సుంకప్ప పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సీఐ

గుంతకల్లుటౌన్: కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో కేపీఎస్ థియేటర్ సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కిమ్స్ వైద్యుడు డాక్టర్ బాలకిశోర్, సిబ్బంది సుమారు 108 మందికి ఉచితంగా బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలను నిర్వహించారు. కాపుసేన నియోజకవర్గ అధ్యక్షుడు రాయల్ రంగా, మండల కమిటీ గౌరవాధ్యక్షుడు కోటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, వంశీ, పాపిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ బుధవారం తెలిపారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లో విద్యుత్ మరమ్మతులు ఉన్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ కాంతులు

తాడిపత్రి అర్బన్: జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ఈసందర్భంగా ప్రజల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. సీఎం వైఎస్.జగన్ హయాంలోనే ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. వచ్చే నెల నుంచి పెన్షన్ల మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3000కు పెంచుతున్నారన్నారు. ప్రతి పేద వాడికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతోఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. టీడీపీ హయంలో వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరిగే వారని, అయితే జగనన్న పాలనలో ఇంటి వద్దే వైద్యం అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ ఆకుల చిన్న నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు ప్రతాప్‌యాదవ్, వాసుదేవరెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, సాయితేజారెడ్డి తదితరులు ఉన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

పట్టణంలోని మార్కెట్‌యార్డులో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్ అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్లా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మించిన ఘనత సీఎం వైఎస్‌జగన్‌కే దక్కుతుందన్నారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆర్‌సి ఓబులరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వేమనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

బలిజల ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న బలిజ సంఘం అధ్యక్షుడు రమణ

గుత్తి: పట్టణంలోని స్పందన ఫంక్షన్ హాల్లో బుధవారం బలిజల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బలిజ సంఘం అధ్యక్ష, గౌరవాధ్యక్షులు మారాకుల రమణ, పీవీ రమణ మాట్లాడుతూ బలిజ సంఘం బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. బలిజలందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సీనియర్ నాయకులు పగడాల శ్రీనివాసులు, శ్రీకరం వెంకటేష్, రాము, మంజు, ఆముదాల గిరిధర్, విశ్వ మోహన్, రఘు, నాగరాజు , నాని రాయల్, జేకె రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ సీఎం వైఎస్ జగన్

•ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా నాలుగున్నరేళ్ల పాలన సాగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచారని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెలగొండ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, ఎంపీటీసీ బీవీ మాధవితో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయా కుటుంబాలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసి పాలనా వ్యవస్థనే ప్రజల వద్దకు తెచ్చిన ముఖ్యమంత్రి జగన్ ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. ఎలాంటి రెకమెండేషన్ లేకుండా, ఎవరికీ రూపాయి లంచం చెల్లించకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి గుమ్మం దగ్గరికే చేర్చిన గొప్పనేత జగన్ అని కొనియాడారు. నవరత్నాల పథకంతో పేదల బతుకుల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దుర్భర జీవితాలను గడుపుతున్న ఎంతోమందికి కొత్త ఊపిరిలూదారని గుర్తు చేశారు. సొంత ఇళ్లులేక జీవితకాలం అద్దె ఇళ్లలో మగ్గుతున్న లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు, ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నారన్నారు. ప్రజల కోసం నిర్విరామ కృషిచేస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను మరోసారి అఖండ మెజారిటీతో గెలిపించి మరోసారి అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. గుత్తి ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి దశరథరెడ్డి, యుగంధర్‌రెడ్డి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, జిల్లా బీసీసెల్ ప్రధాన కార్యదర్శి సుంకన్న, జయరామిరెడ్డి, మల్లికార్జున శాస్త్రి, మండల కన్వీనర్ మోహన్‌రావు, సచివాలయ మండల కన్వీనర్ గోవిందునాయక్, మొలకలపెంట సర్పంచ్ మురహరినాయుడు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పాండు రంగారెడ్డి మండల పోలింగ్ బూత్ కన్వీనర్ రాము, స్థానిక నాయకులు పాటిల్ జయరామిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగనాయకులు, శ్రీరాములు, ఓబుళనాయుడు, కిష్టప్ప, ప్రకాష్,షబ్బీర్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నెలగొండలో ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెద్దపప్పూరు: జగనన్న ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చెర్లోపల్లిలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగితెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో కేవలం రాజకీయ పలుకుబడి ఉన్నవారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంగా చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, సర్పంచు రామేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు అమర్‌నాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవండి

తాడిపత్రి అర్బన్: నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేసిన ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన పట్టణంలోని 3వ వార్డులో పర్యటించారు. సీఎం వైఎస్.జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన వైఎస్.జగన్‌ను తిరిగి సీఎం చేసుకుందామని కోరారు. కౌన్సిలర్ రియాజ్, నాయకులు జాకీర్, అయూబ్, తదితరులు ఉన్నారు.



మహిళతో సమస్య తెలుసుకుంటున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఏపీకి మళ్లీ సీఎంగా జగనన్నే రావాలి

గుంతకల్లుటౌన్: ఏపీలో ప్రస్తుతం అమలవుతున్న నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలన్నా, నిరుపేద ప్రజల ముఖాల్లో చిరునవ్వులు విరబూయాలంటే రాష్ట్రానికి మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. బుధవారం పట్టణంలోని 16,29 వార్డుల కౌన్సిలర్లు అర్షియాబేగం, జేసీబీ.చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఆయా వార్డు సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సచివాలయాల బయట ఏర్పాటు చేసిన పార్టీ పతాకాలను చైర్‌పర్సన్ ఎగురవేసి వందనం చేశారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. సభలనుద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం రంగాల్లో జగనన్న ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్నారన్నారు.నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా నాలుగున్నరేళ్లల్లో జరిగిన అభివృద్ధిని ఆమె వివరించారు. జేసీఎస్ కన్వీనర్ ఖలీల్, 16వ వార్డు ఇన్‌ఛార్జ్ యూనస్, రామాలయ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జునశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



29వ వార్డు సచివాలయంలో సంక్షేమబోర్డు ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ భవాని

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

బుక్కరాయసముద్రం: టెన్త్ విద్యార్థులు మంచి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ గురుప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ సంయుక్తంగా టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్స్, పరీక్షల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణ పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఎంఈఓ–2 లింగానాయక్, హెచ్‌ఎం వసుంధర, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, యూటీఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, ఆత్మీయ ట్రస్ట్ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకులు దివాకర్‌రెడ్డి, లింగమయ్య, శ్రీనివాసరెడ్డి, దేవేంద్రమ్మ, మహమ్మద్ గౌస్, పవన్‌కుమార్ పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

తాడిపత్రిపై గుంతకల్లు ఆర్డీటీ జట్టు విజయం



ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ నందిని

గుంతకల్లు: అనంత ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో బుధవారం తాడిపత్రి ఆర్డీటీ జట్టుపై గుంతకల్లు ఆర్డీటీ జట్టు విజయం సాధించింది. స్థానిక ఎస్‌ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో తొలిత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు ఆర్‌డీటీ జట్టు నిర్ణీత 25 ఓవర్లులో 7 వికెట్లు కోల్పోయి 174 పరుగులు సాధించింది. ఈ జట్టులో బన్నపాడు నందిని 63 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తాడిపత్రి జట్టు 25 ఓవర్లులో 9 వికెట్లు కోల్పోయి 86 పరుగులు మాత్రమే చేసింది. నందిని ఒక్క వికెట్ తీయడంతోపాటు 63 పరుగులు సాధించడంతో ఉమెన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకుంది. గుంతకల్లు ఆర్డీటీ జట్టు క్వార్టర్స్‌కు ఎంపికైనట్లు కోచ్ ఇనాయతుల్లా తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

పామిడి: పామిడిలో గురువారం నిర్వహించే సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడులకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి హాజరుకానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల రూరల్, పట్టణ కన్వీనర్లు కే నారాయణరెడ్డి, జోజోడే కుమార్ బుధవారం తెలిపారు. కేక్ కటింగ్‌తో పాటు కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు రావాలని కోరారు.

రెండిళ్లలో చోరీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో మేధా స్కూల్ ఎదురుగా ఉన్న రెండిళ్లలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు.. అనంతపురం రోడ్డులో నివాసముండే పవన్, హరి పని మీద ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊళ్లకు వెళ్లారు. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇళ్ల తలుపులు తెరిచి ఉన్నాయి.లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. పవన్ ఇంటిలోని బీరువాలో దాచి ఉంచిన 5 గ్రాముల బంగారు ఉంగరంతో పాటు కొన్ని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. హరి ఇంటిలోని కొన్ని విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఎస్‌ఆర్‌ఐటీలో రక్తదాన శిబిరం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎం వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. కొర్రపాడు గురుకుల పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

సంక్షిప్త సమాచారం

ఉపాధి పనులు కల్పించండి

యల్లనూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ వీరరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు,పాల్గొన్నారు.

పుట్లూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీడీ వెంకటరత్నం అన్నారు. బుధవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీఓ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

గార్లదిన్నె: కోటంక, మర్తాడుకు చెందిన 16 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సాగర్ బుధవారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ఉషారాణి ఎదుట హాజరు పరిచి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కోటంకలో ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న 10 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలియజేశారు.

ఇన్వర్టర్ అందజేత

తాడిపత్రి అర్బన్: నాయనపల్లి క్రాస్‌లో ఉన్న కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి బుధవారం రోటరీ క్లబ్ సభ్యులు ఇన్వర్టర్‌ను వితరణగా అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో సభ్యులు ఇన్వర్టర్‌తోపాటు దుప్పట్లు, చాపలు ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. రోటరీ క్లబ్ కార్యదర్శి సుబ్రమణ్యం, సభ్యులు విసి.మద్దిలేటి, బాలసుబ్రమణ్యం, షాకీర్, కుళ్లాయి, గిరి పాల్గొన్నారు.

గ్రామ స్థలాన్ని మున్సిపాలిటీకి కేటాయించడం తగదు

గుంతకల్లు రూరల్: తమ గ్రామ పరిధిలోని ఉన్న ప్రభుత్వ భూమిని మున్సిపాలిటీకి అప్పగించడం తగదని దోనిముక్కల గ్రామస్తులు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దోనిముక్కల గ్రామం సర్వే నెంబర్ 26లో ఉన్న స్థలాన్ని స్మశాన వాటిక ఏర్పాటుకోసం గుంతకల్లు మున్సిపాలిటీకి అప్పగించడానికి సిద్ధమైన నేపథ్యంలో వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గ్రామస్తులు కోరారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను కేవలం గ్రామాభివృద్ధికి వినియోగించాలన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

పెద్దవడుగూరు : రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పాశం రంగస్వామియాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జేసీ సోదరులు టీడీపీలో ఉన్నప్పుడు మండల రైతులు ఎలాంటి అవమానాలకు గురయ్యారో ఇంకా మరచిపోలేదన్నారు. సాగునీటి కోసం అడిగితే జేబులో లేవంటూ హేళన చేశారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రైతులు అడగకుండానే రెండు పంటలకు సాగునీరు అందించారన్నారు. టీడీపీ హయాంలో సాగునీరు ఇవ్వకుండా చాగల్లుకు తీసుకెళ్లిన వారు రైతుల గురించి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కండ్లగూడూరు ఈశ్వరయ్య, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, లక్ష్మంపల్లి నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రాము, నాగరాజు, కాశేపల్లి రామాంజులరెడ్డి, ఆదినారాయణ, కేవీ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని ధర్నాతో ప్రజలకు ఇక్కట్లు

పెద్దవడుగూరు : మిడుతూరు వద్ద జాతీయ రహదారిపై రైతుల పేరుతో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అస్మిత్‌రెడ్డి తమ అనుచరులతో అనుమతి లేకుండా ధర్నా చేపట్టడంతో ప్రజలకు ఇక్కట్లకు గురయ్యారు. దాదాపు గంటసేపు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు అవస్థలు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

గుత్తి: రజాపురం సమీపంలో బుధవారం బైక్‌పై నుంచి పడి భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..కల్లూరుకు చెందిన చిదంబరయ్య, వరలక్ష్మి దంపతులు గుంతకల్లులో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. రజాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అటుగా వెళుతున్న గుత్తి ఎస్ఐ నబీరసూల్ తన వాహనంలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మత్స్యకారుల అభివృద్ధికి జగనన్న కృషి

పెద్దపప్పూరు: మత్స్యకారుల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం చాగల్లు ప్రాజెక్టులో ఆయన 3 లక్షల చేపపిల్లలను వదిలారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మత్స్యకారులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చాగల్లు ప్రాజెక్టులో చుక్కనీరులేక దిష్టిబొమ్మలా పడి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్లలో జలకళ సంతరించుకోవడంతో పాటు దాదాపు 50 టీఎంసీల నీటిని దిగువ పెన్నా నదికి నీరు విడుదల చేశామన్నారు. తద్వారా బోరుబావుల్లో భూగర్భజలాలు పెరగడంతో బీడుభూములు సాగులోకి వచ్చాయన్నారు. ప్రాజెక్టులో నీరు చేరడంతో మత్స్యకారుల ఉపాధికి అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ వెంకటరామి రెడ్డి (రామయ్య) వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పక్కీరయ్య, తహసీల్దార్ లక్ష్మానాయక్, మత్స్యకార కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వరం

పెద్దపప్పూరు: ఆరోగ్య పథకం నిరుపేదలకు ఓ వరమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిలో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు మాత్రమే ఉచిత వైద్యం అందేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ పరిమితిని రూ.25లక్షల వరకు వర్తించేలా చేశారన్నారు. బియ్యం కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడినపుడు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి,జిల్లా వైఎస్సార్‌టీయూ జనరల్ సెక్రటరీ నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, వైద్యులు ఉషారాణి, తేజశ్విని, హెల్త్ సూపర్‌వైజర్ షర్మాస్ వలి తదితరులు పాల్గొన్నారు.



చాగల్లు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి